పాలకొల్లులో తాగునీటి కష్టాలు

- వారం రోజులుగా ఒక పూటే నీటి సరఫరా
- శివారు ప్రాంతాలకు అందని నీరు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసవిలోనూ రెండు పూటలా అందిన తాగునీరు



కొత్త ఎస్ ఎస్ ట్యాంకులో అడుగంటిన నీరు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణ శివారు ప్రాంతాల ప్రజలను తాగునీటి సమస్య వేధిస్తోంది. వేసవికాలంలో ఈ సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తుంది. పాలకొల్లులో రెండు ఎస్ఎస్ (సమ్మర్ స్టోరేజ్) ట్యాంకులు, మూడు ఓహెచ్ఆర్ (ఓవర్ హెడ్ రిజర్వాయర్లు) ఉన్నాయి. యడ్లబజారు సెంటర్, బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్, వాటర్ వర్క్సులో ఓహెచ్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. పట్టణ శివారు ప్రాంతాలైన బెత్లహంపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, న్యూ బ్యాంక్ కాలనీ, చినగోపురం ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉండేది. ఈ సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.15 కోట్లతో ఫిల్టర్ ప్లాంట్, హౌసింగ్ బోర్డు కాలనీ, బెత్లహంపేట ప్రాంతాల్లో మరో రెండు ఓహెచ్ఆర్ ట్యాంకులను నిర్మించారు. వీటితో పట్టణంలో ప్రస్తుతం ఐదు ఓహెచ్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి వల్ల శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరడమే కాకుండా పాత మూడు ఓహెచ్ఆర్లపై ఒత్తిడి తగ్గి అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా విడుదల అవుతుంది. గత వారం రోజుల నుంచి అధికారులు రోజుకు ఒక పూట మాత్రమే తాగునీరు సరఫరా చేస్తుండడంతో పట్టణ శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాడు రెండు పూటలా నీరు సరఫరా

గతంలో పట్టణ జనాభా సుమారు 30 వేలు వరకు ఉంది. నేడు పట్టణ జనాభా సుమారు లక్షకు చేరింది. పాత ఎక్విప్‌మెంట్ నుండే నీటిని సప్లయి చేస్తూ వస్తున్నారు. దీంతో నిత్యం ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట నీటిని సరఫరా చేసేవారు. వేసవి కాలంలో ఒక పూట మాత్రమే నీటిని సరఫరా చేసేవారు. అదికూడా ఉదయం ఒక అర గంట విద్యుత్ సరఫరా నిలుపుదల చేయించి పట్టణంలో కొంత వరకు నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకునేవారు. గత ప్రభుత్వంలో వేసవిలో కూడా తాగునీరు రెండు పూటలా ఇచ్చేలా మునిసిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాలకొల్లు చరిత్రలోనే వేసవిలో రెండు పూటలా తాగునీరు సరఫరా చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కింది. గత వారం రోజుల నుంచి ఒక పూటే నీరు సరఫరా చేస్తుండడంతో తమ వరకు నీరు రావడంలేదని పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

రోజుకు రెండు కోట్ల లీటర్లు సరఫరా

పట్టణంలో కుళాయి కనెక్షన్లు సుమారు 10,500, ఎస్ఎస్ ట్యాంకుల సామర్థ్యం 336 మిల్లీ లీటర్లు. పట్టణంలో తాగునీటి పైపులైన్ల విస్తరణ సుమారు 95 కిలోమీటర్ల వరకు ఉంది. రోజుకు 90 లక్షల లీటర్ల నీరు సరఫరా చేసేవారు. 2023లో నూతనంగా ప్రారంభమైన రెండు ఓహెచ్ఆర్‌ల్లో ఒక్కో ట్యాంకు నుంచి పది లక్షల లీటర్లు విడుదల అవుతుంది. నూతన ఫిల్టర్ ప్లాంట్ 1.10 కోట్ల లీటర్లు సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న పాత ఫిల్టర్ ప్లాంట్ నుంచి 90 లక్షల లీటర్లు సామర్థ్యం. మొత్తం కలిపితే రోజుకు రెండు కోట్ల లీటర్లు సరఫరా జరుగుతుంది.

నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది



కాలువ పనులు చేస్తుండడంతో నీటి విడుదల ఆలస్యమైంది. వారం రోజుల క్రితం వరకు రెండు పూటలా తాగునీరు అందించాం. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకుల్లో ఉన్న నీరు కాలువ విడుదల అయ్యేవరకు సరిపోతుంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఒక్కపూట నీరు అందిస్తున్నాం. తాగునీరు పంపిణీ పెరగడం ఎస్ ఎస్ ట్యాంకులు సామర్థ్యం అంతే ఉండడంతో కొంత సమస్య ఏర్పడింది. రెండు రోజుల్లో కాలువ నీరు విడుదల అయిన తరువాత మరో రెండు రోజులు వేస్ట్ వాటర్ వదిలేసిన అనంతరం ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటిని నింపుతాం. మరో నాలుగు రోజుల్లో రెండు పూటలా పట్టణంలో తాగునీరు అందిస్తాం.

– రాజ్‌కుమార్, మునిసిపల్ డీఈ, పాలకొల్లు



వాటర్ వర్క్స్ వద్ద అడుగంటిన ఎస్ఎస్ ట్యాంకు



గ్రామాల్లో నీటి కొరతను తెలియజేస్తున్న గ్రామస్తులు



వాటర్ వర్క్స్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

క్లుప్తంగా

నేవల్, ఎన్‌సీసీ కేడెట్ల రక్తదానం



బ్లడ్ డోనర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న కమాండర్ రోహిత్ కుమార్

నరసాపురం: రక్తదానంతో ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని నరసాపురం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ సి.రోహిత్ కుమార్, 7 ఆంధ్రా నేవిగేట్ ఎన్‌సీసీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సంజిత్‌రాత్రే అన్నారు. బ్లడ్ డోనర్స్‌డే సందర్భంగా శుక్రవారం స్థానిక 7 ఆంధ్రా నేవల్ యూనిట్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 30 మంది నేవల్, ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు గోపిశెట్టి వెంకట మురళీకృష్ణ, నరసాపురం సమన్వయకర్త ఎనుముల సతీష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ పేర్రాజు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి చేయూత



సత్యవాణికి చెక్కు అందిస్తున్న బుద్ధరాజు

యలమంచిలి: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని గుంపర్రు గ్రామానికి చెందిన బండి సత్యవాణి (32)కి వైద్యం నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు మానవతా దృక్పథంతో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. సంబంధిత చెక్కును వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు శుక్రవారం సత్యవాణి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధరాజు మాట్లాడుతూ సత్యవాణి కుటుంబానికి కూలి పనులే జీవనాధారమని, ఆమె వైద్యం ఖర్చుల కోసం ఇప్పటికే రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారని తెలిపారు. అయినా ఇంకా ఆమె పూర్తిగా కోలుకోలేదన్నారు. ఈ సందర్భంగా సత్యవాణి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించిన వెంకట్రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం



సంపత్ వినాయకునికి పుష్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

యలమంచిలి: మేడపాడు ఏవీఆర్ నగర్‌లోని సంపత్ వినాయక ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అర్చకులు యేడిద నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో పది మంది వేద పండితులు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. సిద్ధి బుద్ధి సమేత సంపత్ గణపతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం దేవేరులను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి బుద్ధి సమేత సంపత్ గణపతికి పుష్పోత్సవం కనుల పండుగగా చేశారు. ఈ పూజలన్నీ గ్రామానికి చెందిన అడబాల వెంకట ఖాళీ ప్రసాద్, శంకర పార్వతి దంపతులు పీటలపై కూర్చుని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కొమ్మిరెడ్డి ఉదయ భాస్కరరావు, పిల్ల పద్మారావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్త పింజరిల హల్‌చల్



సిద్ధాంతంలో హతమైన రక్త పింజరి

పెనుగొండ: వర్షాలు పడుతుండడంతో రక్త పింజరిలు హల్‌చల్ చేస్తున్నాయి. జనావాసాల మధ్యకు రక్త పింజరిలు చేరుతుండడంతో హడలి పోతున్నారు. శుక్రవారం సిద్ధాంతం జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో పెట్రోలు బంక్ సమీపంలో రక్తపింజరి కనిపించడంతో ఆప్రాంత వాసులు బెంబేలెత్తిపోయారు. ఇటీవల కాలంలో రక్త పింజరి కాటుకు పలువురు గాయాల పాలయ్యారు. దీంతో అప్రమత్తమైన స్థానికులు సుమారు 6 అడుగులు ఉన్న రక్త పింజరిని హతమార్చారు.

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మవారికి శుక్రవారం భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, జయశ్రీ దంపతుల కుమార్తె రావూరి కృష్ణ శ్రీ నందిని 8 గ్రాములు బంగారాన్ని సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందచేశారు.ఈసందర్భంగా డీఎస్పీ జయసూర్య దంపతులు మాట్లాడుతూ అమ్మవారి మొక్కు తీర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు.

పీఎల్‌కే స్కూల్ కరస్పాండెంట్‌గా చిట్టిబాబు



డీఈఓ నారాయణకు కృతజ్ఞతలు చెబుతున్న చిట్టిబాబు

యలమంచిలి: పాలకొల్లు పీఎల్‌కే ఎలిమెంటరీ, ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌గా బి.చిట్టిబాబు నియమితులయ్యారు. స్థానిక శ్రీ లాజరస్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఈ స్కూల్‌కు కరస్పాండెంట్‌గా చిట్టిబాబును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. నారాయణను శుక్రవారం చిట్టిబాబు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బస్‌పాస్‌ల జారీ పునరుద్ధరణ

నరసాపురం: ఆర్టీసీ స్థానిక డిపో పరిధిలో ఉన్న నరసాపురం, పాలకొల్లు బస్టాండ్లలో రెండు రోజులపాటు నిలుపుదల చేసిన విద్యార్థుల బస్‌పాస్‌ల జారీని పునరుద్ధరించామని డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. కౌంటర్ల వద్ద అవసరమైన పత్రాలు అందజేసి బస్‌పాస్‌లు పొందొచ్చని విద్యార్థులకు సూచించారు. ముందుగా ఆన్‌లైన్ చేసుకుంటే, తక్కువ సమయంలో పాసులు పొందొచ్చన్నారు.

భీమవరం అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్‌ఓగా శ్రీనివాసరావు

భీమవరం: భీమవరం అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్‌ఓగా కె శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ సూర్య ప్రకాశరావు విజయవాడ బదిలీకావడంతో నిడదవోలులో పనిచేస్తున్న శ్రీనివాసరావు భీమవరం ఏడీఎఫ్‌ఓగా నియమించారు. అలాగే ఇక్కడ వివిధ హోదాల్లో పనిచేస్తున్న 14 మంది సిబ్బంది బదిలీ అయ్యారు. వారిస్థానంలో లీడింగ్ ఫైర్‌మెన్స్‌గా ఎం శ్రీను, ఎస్ వెంకటేశ్వర్లు, ఎం లక్ష్మణస్వామి, డ్రైవర్, ఆపరేటర్స్‌గా ఎస్ శ్రీనివాస్, ఐఎస్‌వీఎస్ శ్యామ్‌కుమార్, టీబీ శేషగిరి, పి సూరిబాబు, ఫైర్‌మెన్స్‌గా పి శ్రీనివాసరావు, డీపీ రాజు, ఎ వాసుకృష్ణ, పీపీ సత్యనారాయణ, వి వెంకటేష్, ఎస్‌కే అబ్దుల్‌జబ్బర్, ఎ రియాజ్ నియమితులయ్యారు.

ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో మరొకరికి ప్రాణం పోసినట్లేనని తద్వారా ఒక కుటుంబం ఆనందంగా జీవించగలుగుతారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రమాదం జరిగిన మొదటి గంటలో రక్తం అందజేస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.ఎస్.వి శివరామ భద్రరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బి.భాను నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డీఈవో ఇ.నారాయణ, ఆర్డీవో ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఏసుబాబు, వబిలిశెట్టి శెట్టి కనకరాజు, పదుల సంఖ్యలో రక్తదానం చేసిన దాతలు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు, చర్చ్ ఆఫ్ గాడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు లోకల్ చాప్టర్ యాస్పిరెంట్ అవార్డు



డీఎన్నార్ కళాశాలకు అవార్డు వచ్చిన విషయాన్ని వివరిస్తున్న అధ్యక్షుడు నర్సింహరాజు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రతిష్ఠాత్మకమైన లోకల్ చాప్టర్ యాస్పిరెంట్ అవార్డుకు ఎంపికైందని కళాశాల అధ్యక్షుడు గోకరాజు నర్సింహరాజు చెప్పారు. శుక్రవారం కళాశాలలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌పీటీఈఎల్‌లో కొత్త కోర్సులు చేయడంలో తమ ఇంజనీరింగ్ కళాశాల మందంజలో ఉండడంతో అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. జూలై 5వ తేదిన మద్రాస్ ఐఐటిలో అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు. అలాగే ఈసీఈ విభాగానికి చెందిన అధ్యాపకుడు కె శేఖరబాబుకు మోటివేటెడ్ లెర్నర్‌బిలివర్, టాప్ పెర్ఫార్మింగ్ మెంటార్ స్టార్ అవార్డులు, ఈసీఈ విభాగాధిపతి కె వేణుగోపాల్‌కు బిలివర్ స్టార్ అవార్డు దక్కినట్లు నర్సింహరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ బీవీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాబితా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాలోని రైతులంతా రైతు సేవా కేంద్రానికి వెళ్లి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె కోరారు. ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేసే అవకాశం లేదని, కనుక దూరప్రాంతంలో ఉన్న రైతులు కూడా వారి గ్రామానికి చెందిన రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలిముద్ర వేయాలని పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయితే రైతులకు సొంత భూమి ఉందో ఆ గ్రామ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలో మాత్రమే వేలిముద్ర పడుతుందని వివరించారు. ఈ నెల 20 వరకు మాత్రమే గడువుందని ఈలోపు వేలిముద్ర వేయాలని ఆమె కోరారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని ఆరా ఫౌండేషన్ కరిబండి రామకృష్ణ గురూజీ ఆధ్వర్యంలో ప్రొటోకాల్ యోగాలో భాగంగా స్థానిక ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శుక్రవారం యోగాంధ్ర నిర్వహించారు. యోగా సాధకులు హాజరై యోగా చేశారు. విశ్వ విద్యాలయం నిర్వాహకురాలు బీకే రమాదేవి అధ్యక్షత వహించారు. నాయకులు ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, మునిసిపల్ కమీషనర్ ఏసుబాబు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పరీక్షలు

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జరుగుతున్న మెగా డీఎస్సీ పరీక్షలు సాఫీగా జరుగుతున్నాయి. శుక్రవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఈ పరీక్ష జరిగింది. ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు కలిపి 308 మందికి గాను 299 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు పర్యవేక్షించారు. టిస్టు సెంటర్ అడ్మిన్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్‌లు పాల్గొన్నారు.

పాలమూరు పంచాయతీలో అక్రమ నియామకాలు

పెనుమంత్ర: మండలంలోని పాలమూరు గ్రామ పంచాయతీలో గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా ఒక వార్డ్ మెంబర్‌కు అనుకూలంగా కాంటాక్ట్ సిబ్బందిని నియమించారని గ్రామానికి చెందిన టెండరు దారురుడు సుంకర సాయిరాం ఆరోపించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారికి, నలుగురు వార్డు సభ్యులు, డివిజనల్ పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశానని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 మంది వార్డు సభ్యులు ఉన్న పాలమూరు పంచాయతీ కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య నిర్వాహకులతో పాటు మూడు ట్యాంక్ వాచర్, ఒక ఎలక్రీషయన్ పోస్టు భర్తీ టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ట్యాంక్ వాచర్‌కు ఐదుగురు, ఎలక్ట్రిషియన్‌కు ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ట్యాంక్ వాచర్ పోస్టుకు కల్గిండి వెంకట పెద్దిరాజు రూ.11500, కేత మధుసూదన్ రావు రూ.11999, పంపన కుమార్ గణేష్ రూ.10500, పిల్లి మునలయ్య రూ.12000, గుమ్మడి అనిల్ కుమార్ రూ.12000లకు టెండర్లు దాఖలు చేయగా, కేత మధుసూదన్ రావు, పంపన గణేష్ కుమార్, పెల్లి మునలయ్యలను ట్యాంక్ వాచర్లుగా నియమించారు. ఎలక్ట్రిషన్ పోస్టులకు సుంకర సాయిరాం రూ.5300, పంపన కుమార్ గణేష్ రూ.9000, పంపన త్రిమూర్తులు రూ.13000లకు టెండర్లు వెయ్యగా ఎలక్ట్రిషన్‌గా ఎక్కువ మొత్తంలో కోట్ చేసిన పంపన త్రిమూర్తులకు నియమక ఉత్తర్వులు ఇచ్చినట్లు సుంకర సాయిరాం పేర్కొన్నారు. బోర్డు మీటింగ్‌లతో ఇష్టం వచ్చినట్లు నియామకాలు చేసి కార్యదర్శి తమను మోసం చేశారని వార్డు సభ్యులు కౌర్ శ్రీరామ్, గుండె పల్లి సుబ్బలక్ష్మి, దిద్దే నరసన్న బాబు, పితాని అనంతలక్ష్మి మరో ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇన్‌చార్జి కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా గ్రామ సర్పంచ్, ఏడుగురు సభ్యుల ఆమోదం మేరకే ఈ నియామకాలు చేపట్టినట్టు చెప్పారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో కీటక జనిత, నీటి జనిత వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు కప్పల వెంకన్న సెంటర్‌లోని తోట వారి వీధి, ముదిగొండ వారి వీధుల్లో శుక్రవారం నిర్వహించిన మలేరియా మాసోత్సవం జూన్ 2025, ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటి వ్యాధులు వ్యాపించే పరిస్థితులు ఉంటాయని అన్నారు. వీటన్నింటికి పరిష్కారం ఒక్కటేనని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నిరుపయోగ సామగ్రిలో వారం రోజులకు పైబడి స్తబ్ధతతో కూడిన నీటినిల్వలు తక్షణమే తొలగించుకోవాలని, వర్షాకాలం అన్ని రోజులు ప్రతీ రోజూ డ్రైడేగా పాటించడం అలవాటు చేసుకోవాలని, చెత్తను డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, డ్రెయిన్‌లలో వేయరాదని, చేతులు శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు వేయాలని సూచించారు. ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె. సత్యనారాయణ, వార్డుహెల్త్ సెక్రెటరీలు టి.లక్ష్మీ కాంతం, ఎస్. స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

కమిషనర్‌కు అవార్డు

తాడేపల్లిగూడెం: గూడెం మునిసిపల్ కమిషనర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు దక్కింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. జనవరిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అత్యధికంగా రక్తదానం చేయడానికి ప్రోత్సహించినందుకు గాను ఈ అవార్డు ఆయనకు దక్కింది. ఈ సందర్భంగా కమిషనర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు జూలై 5వ తేదీన తాడేపల్లిగూడెం కోర్టు భవనాలు సముదాయం ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. అదనపు జిల్లా జడ్జి కోర్టులో శుక్రవారం పోలీస్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సికిందర్ బాషా మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ చేసుకొనే విధంగా చూడాలన్నారు. దీంతో కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. కేసుల రాజీ విషయంలో పోలీసులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలిత కుమారి, కోర్టు పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

15న తణుకులో
అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

తణుకు అర్బన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 15 వతేదీ తణుకులో నిర్వహించనున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సమావేశానికి కస్టమర్స్, ఏజెంట్స్ అధికసంఖ్యలో తరలిరావాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు కోరారు. శుక్రవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి గురై తీవ్రంగా నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ సహకారంతో గత 10 సంవత్సరాలుగా నిర్విరామంగా ఉద్యమిస్తున్నామన్నారు. ఉద్యమ ఫలితంగా 10 వేలు 20, వేలు రూపాయల లోపు డిపాజిట్ల సొమ్ము పొందడం జరిగిందన్నారు. ఇంకా మిగిలిన బాధితులకు సుమారు 3 వేల 400 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించవలసిన డిపాజిట్ల సొమ్ముకన్నా అగ్రిగోల్డ్ ఆస్తులు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం అగ్రి ఆస్తులు స్వాధీనం చేసుకుని బాధితులకు తక్షణ న్యాయం అందజేయాలన్నారు. అగ్రి ఆస్తులు మాఫియా చేతుల్లోకి పోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే వందలాది ఎకరాలు కబ్జాదారుల అధీనంలో ఉన్నా యని తక్షణమే కబ్జాదారుల నుంచి భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, అసోసియేషన్ మహిళా కార్యదర్శి వై.నాగలక్ష్మి, నూనె రామశ్రీను, జి. కొండయ్య, పి.శ్రీనువాసు, పి.పాల్ సింగ్, జె.వెంకటసత్యనారాయణ, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.